andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 ; కనిష్ఠం 22.3
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
బుధవారం 28 ఫిబ్రవరి 2024



జన్నేపల్లి మాటు కాల్వను పరిశీలించిన ఇరిగేషన్ డీఈ

నవీపేట,ఫిబ్రవరి27: మండలంలోని జన్నేపల్లి మాటు కాల్వను ఇరిగేషన్ డీఈ బలరాం మంగళవారం పరిశీలించారు. జన్నేపల్లిలో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని స్థానిక రైతులు కలిసి జన్నేపల్లి మాటు కాల్వను ఆధునీకరించాలని కోరారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశం మేరకు డీఈ బలరాం మాటు కాలువలో గండ్లు పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. మాటు కాల్వ జీవో పాయింట్ వద్దపడిన గండ్లను పూడ్చి మరమ్మతు చేయడానికి రూ.8.20 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే సంబంధిత పనులను ప్రారంభించనున్నట్లు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం!

- మూడేళ్ల క్రితం చేసుకున్నవారికి క్రమబద్ధీకరణకు ప్రభుత్వ అవకాశం
- వచ్చే మార్చి 31 వరకు క్రమబద్ధీకరించుకోవాలని ఆదేశాలిచ్చిన సర్కారు
- జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కింద 71వేల 500 దరఖాస్తులు
- వీటిని పరిశీలించేందుకు నిర్ణయించిన అధికారులు

నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఉన్న అనధికార ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో మూడేళ్ల క్రితం దరఖాస్తు చేసుకున్నవారికి అవకాశమిచ్చింది. ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు వచ్చే మార్చి 31 వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మున్సిపాలిటీల్లోని ప్రణాళిక, పట్టణాభివృద్ధి విభాగం అధికారులు ఈ దరఖాస్తులను పరిశీలించనున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులను ఆమోదించడంతో పాటు నిర్ణీత ఫీజు చెల్లించిన వాటిని క్రమబద్ధీకరించనున్నారు. ప్రభుత్వం నెల రోజుల సమయం ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకునే వారు పెద్దఎత్తున క్రమబద్ధీకరించుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద వచ్చిన దరఖాస్తులన్నీ పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు విడుదల కాగానే వాటి అనుగుణంగా పరిశీలించి చర్యలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఎల్‌ఆర్‌ఎస్ కింద భారీగా దరఖాస్తులు రావడంతో క్రమబద్ధీకరణతో మున్సిపాలిటీలకు, గ్రామ పంచాయతీలకు భారీగా ఆదాయం వచ్చే అవకాశం ఉండడంతో ప్రత్యేక సిబ్బందిని నియమించి పరిశీలించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

జిల్లాలో 71,500లకు పైగా అనధికార ప్లాట్లు

అనధికారికంగా కొనుగోలు చేసిన ప్లాట్లను క్రమబద్ధీరించేందుకు అప్పటి ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఎల్‌ఆర్‌ఎస్‌కు అవకాశమిస్తూ దరఖాస్తు చేసుకోవాలని కోరింది. ప్రభుత్వం తరపున నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్‌కు అనుగుణంగా జిల్లాలో సుమారు 71,500లకు పైగా అనధికార ప్లాట్ల యజమానులు క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ దరఖాస్తుకు రూ.వెయ్యి ఫీజు పెట్టినా ఎక్కువమంది దరఖాస్తులను చేశారు. వ్యవసాయ భూములను అనధికారికంగా ప్లాట్లు చేసి అమ్మడంతో ఎక్కువమంది కొనుగోలు చేశారు. నాలా కన్వర్షన్‌తోపాటు ఇతర అనుమతులు తీసుకోకుండానే అమ్మకాలను చేశారు.

వీటన్నింటిని క్రమబద్ధీకరించేందుకు అప్పటి ప్రభుత్వం అనుమతులిచ్చింది. ఎలాంటి అనుమతులూ లేకుండా కొనుగోలు చేసినవారు సరైన డాక్యుమెంట్లను సమర్పించి నిర్ణీత ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరింది. అప్పటి ప్ర భుత్వం నోటిఫికేషన్ ప్రకారం నిజామాబాద్ నగర కార్పొరేషన్ పరి ధిలో భారీగా దరఖాస్తులను చేసుకున్నారు. కార్పొరేషన్ చుట్టూ వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చకుం డానే ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్లు చేసిన ప్లాట్లను అమ్మడంతో ఎక్కువమంది కొనుగోలు చేశారు.

కార్పొరేషన్ పరిధిలో 33,150 ప్లాట్లు

అనధికారిక ప్లాట్లను క్రమబద్ధీరించేందుకు అప్పటి ప్రభుత్వం అవకాశమివ్వడంతో నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలో 33,150 మంది దరఖాస్తులు చేశారు. అలాగే ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో 5,100 దరఖాస్తులు, బోధన్ మున్సిపాలిటీ పరిధిలో 13,250 మంది దరఖాస్తులు చేశారు. వీటితోపాటు జిల్లాలో గ్రామ పంచాయతీల పరిధిలో అనధికారిక ప్లాట్ల క్రమబద్ధీరరణ కోసం 20వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. ఇలా మొత్తంగా జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కింద మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో 71,500 దరఖాస్తులు వచ్చాయి. వీటన్నింటిని ప్రభుత్వం ఇచ్చిన ఎల్‌ఆర్‌ఎస్ పోర్టల్‌లో నమోదుచేశారు. ఆ తర్వాత కొన్ని కోర్టు కేసులు నమోదుకావడంతో క్రమబద్ధీకరణ నిలిచింది. శాసనసభ ఎన్నికలకు ముందు క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకున్నా ఎన్నికలకోడ్ రావడంతో నిలిపివేశారు. ప్రస్తుత ప్రభుత్వం మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల క్రమబద్ధీకరణకు అవకాశమివ్వడంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

సరైన పత్రాలు ఉంటేనే క్రమబద్ధీకరణ

క్రమబద్ధీకరణ కోసం జిల్లాలో భారీగా దరఖాస్తులు రావడంతో అన్నింటిని పరిశీలించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం మార్చి 31వరకు అవకాశం ఇవ్వడంతో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తులు చేసినవారు సరైన పత్రాలను సమర్పిస్తే పరిశీలించనున్నారు. అనుమతులు రాగానే నిర్ణీత ఫీజును చెల్లించిన వారికి అనధికార ప్లాట్‌ను క్రమబద్ధీకరించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అటవీ, దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూములతోపాటు కోర్టు కేసులు ఉన్న భూములను ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసినా అనుమతులు ఇవ్వరు.

భూమి విలువను బట్టి రిజిస్ట్రేషన్ ఫీజు

ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసినవారు భూమి విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాలి. ఆయా ప్రాంతాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ విలువను బట్టి ఈ ఫీజు ను నిర్ణయించారు. భూమి గజం విలువ రూ.3వేల లోపు ఉంటే 20శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే క్రమబద్ధీకరి స్తారు. దీంతోపాటు అదనంగా నాలా కన్వర్షన్ ఫీజును కూడా చెల్లించాలి. భూమి విలువ రూ.3నుంచి 5వేల లోపు ఉంటే 30 శాతం, రూ.5వేల నుంచి 10వేల లోపు ఉంటే 40శాతం, రూ.10వేల నుంచి 20వేల లోపు ఉంటే 50శాతం, రూ.20వేల నుంచి 30వేల లోపు ఉంటే 60శాతం, రూ.30 నుంచి 50వేల లోపు ఉంటే 80 శాతం, రూ.50 వేలకు పైగా ఉంటే 100 శాతం చెల్లించాలి. గత ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల ప్రకారమే ఈ ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. నెల రోజులపాటు సమయం ఇవ్వడంతో అదనపు సిబ్బందిని నియమించి పరిశీలించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మున్సిపాలిటీల పరిధిలో ఎక్కువమంది క్రమబద్ధీకరించుకునే అవకాశం ఉండడంతో వాటి పరిధిలో సిబ్బందిని నియమించనున్నారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో నిబంధనలు రాగానే దరఖాస్తులను పరిశీలించేందుకు నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తామని నిజామాబాద్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగం అధికారి కరుణాకర్ తెలిపారు. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా నిబంధనలు రాలేదని, ఎల్‌ఆర్‌ఎస్ ప్రారంభంలో కొన్ని దరఖాస్తులు క్రమబద్ధీకరించామని పేర్కొన్నారు. ఈ దఫా నెల రోజులు అవకాశం ఇవ్వడంతో వేల మంది క్రమబదీకరించుకునే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు.



తెలంగాణలో 15 ఎంపీ సీట్లు సాధిస్తాం

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



ధర్పల్లిలో మాట్లాడుతున్న బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

ధర్పల్లి, ఫిబ్రవరి 27: తెలంగాణలో ఈసారి 15 ఎంపీ స్థానాలు బీజేపీ గెలుచుకుంటుందని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధీమావ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలో విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ 15 ఎంపీ స్థానాలు మరోసారి ప్రధానిగా నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. దేశంలో 400 ఎంపీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తున్నారు. సంక్షేమ పథకాలే కాకుండా భద్రతకు మోదీ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో వారం రోజుల పాటు యాత్ర కొనసాగుతుందన్నారు. ప్రపంచ దేశంలో ప్రధాని మోదీ నెంబర్ వన్ స్థానంలో ఉన్నారని ఆమె పేర్కొన్నారు. ఏ దేశానికి వెళ్లిన ప్రధాని మోదీ ముందు వరుసలో ఉన్నారని అన్నారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో దేశానికి ప్రధాని వెన్నుదన్నుల నిలిచి అత్యంత వేగంగా కరోనా మహమ్మరిని అరికట్టడమే కాకుండా దేశ ప్రజలకు కరోనా టీకాను అందించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. దేశప్రజలకు ఆత్మవిశ్వాసం నింపారన్నారు. దేశ ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రజలు బీజేపీకి ఓటు వేయాలన్నారు. అంతకుముందు ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ తనను మరోసారి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ఎంపీ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈయాత్రలో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, పల్లె గంగారెడ్డి, కర్క గంగారెడ్డి, దాసు, మహేష్, పాల్గొన్నారు.

జిల్లాలో రాజుకుంటున్న పార్లమెంట్ ఎన్నికల వేడి!

- ప్రచారం మొదలుపెట్టిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నేతలు
- రెండు రోజులుగా కొనసాగుతున్న విజయ సంకల్ప యాత్ర
- పార్లమెంట్ ఎన్నికలే ఎజెండాగా కాంగ్రెస్ నేతల కార్యకలాపాలు
- కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఎమ్మెల్యేలు, మంత్రులు
- జిల్లాలో నేటికీ పార్లమెంట్ ఎన్నికల సన్నాహాలు చేయని బీఆర్‌ఎస్ నేతలు



నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇప్పటికే ప్రధాన పార్టీల నేతలు ప్రచారం మొదలుపెట్టారు. నియోజకవర్గాల్లో పర్యటిస్తూ వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. బీజేపీ నేతలు విజయసంకల్ప యాత్రను పార్లమెంట్ పరిధిలో మొదలుపెట్టారు. గడిచిన రెండు రోజులుగా సిట్టింగ్ ఎంపీతోపాటు పార్టీ సీనియర్ నేతలు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో పర్యటించడంతోపాటు ప్రధాని మోదీకి మరోదఫా అవకాశం ఇవ్వాలంటూ ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు మంత్రులు పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

షెడ్యూల్‌కు ముందే ప్రచారాలు

పార్లమెంట్ ఎన్నికలకు ఇంకా షెడ్యూల్ ప్రకటించక ముందే జిల్లాలో ఎన్నికల ప్రచారం జోరందుకుంటోంది. నిజామాబాద్ పార్లమెంట్ స్థానంపై గురిపెట్టిన కాంగ్రెస్, బీజేపీ నేతలు జోరుగా ప్రచారం చేస్తున్నారు. బలమైన అభ్యర్థులను బరిలోకి దించుతున్న ఈ రెండు పార్టీల నేతలు పూర్తిస్థాయిలో కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఉపయోగపడే విధంగా ముందస్తుగా నియోజకవర్గాలను పర్యటిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలో ఈ రెండు పార్టీల కంటే బలంతో పాటు ఎక్కువమంది ప్రజాప్రతినిధులున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఇంకా ప్రచారాన్ని మొదలుపెట్టలేదు. ఎమ్మెల్యేలు కూడా ఎక్కువగా ప్రచారాన్ని కొనసాగించడం లేదు. శాసనసభ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో పర్యటించకపోవడం, క్యాడర్ కూడా సరైన మార్గదర్శకత్వం లేకపోవడంతో వచ్చే ఐదేళ్లను దృష్టిలో పెట్టుకుని ఇతర పార్టీల వైపు మళ్లుతున్నారు. ఎక్కువమంది అధికారంలో ఉన్న కాంగ్రెస్‌లో చేరుతుండగా కొంతమంది బీజేపీవైపు వెళ్లిపోతున్నారు. ఈ రెండు పార్టీల నేతలు పార్లమెంట్ పరిధిలో కార్యక్రమాలను నిర్వహిస్తూనే వలసలను ప్రోత్సహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి వస్తుందని మండల, నియోజకవర్గ స్థాయి నేతలను తమ పార్టీలో చేర్చుకుంటున్నారు.

సీటు ఖాయమని ఎంపీ అర్వింద్ పర్యటనలు

సీటు దాదాపు ఖాయం కావడంతో ఎంపీ అర్వింద్ గడిచిన నెల రోజులుగా పార్లమెంట్ పరిధిలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తూనే తనకు కలిసివచ్చే విధంగా మద్దతును కూడగట్టుకునేందుకు గట్టి ప్రయత్నాలను చేస్తున్నారు. పార్టీ నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్ర కూడా పార్లమెంట్ పరిధిలో కొనసాగుతుండడంతో జోరుగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో ఐదు ప్రాంతాల్లో ఈ విజయ సంకల్పయాత్ర నిర్వహిస్తుండగా పార్లమెంట్



పరిధిలో గడిచిన రెండురోజులుగా కొనసాగుతోంది. జగిత్యాల, కోరుట్ల, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్‌లలో ఈ విజయ సంకల్ప యాత్ర నిర్వహించగా.. నేడు ఆర్మూర్ నియోజకవర్గంలోని నందిపేట, బోధన్ నియోజకవర్గంలో నిర్వహించనున్నారు. ఈ విజయ సంకల్ప యాత్రలో పార్టీకి చెందిన సీనియర్ నేతలు, మాజీ మంత్రులు డీకే అరుణ, ఈటల రాజేందర్, సిట్టింగ్ ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు రాకేశ్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణలతోపాటు పార్టీ సీనియర్ నేతలు జిల్లా నాయకులు పాల్గొంటున్నారు. నేడు బోధన్‌లో విజయ సంకల్ప యాత్ర పూర్తవుతుండగా రేపు నిజామాబాద్‌లో బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. ఎన్నికలే ఏజెండాగా ఈ ప్రచారం సాగుతోంది.

కాంగ్రెస్ నేతల పలు కార్యక్రమాలు

నిజామాబాద్ పార్లమెంట్ స్థానంపై దృష్టి పెట్టిన కాంగ్రెస్ నేతలు గడిచిన నెల రోజులుగా నియోజకవర్గాల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా రెండు నియోజకవర్గాల్లోనే ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి ఉండగా వీరి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మిగతాచోట్ల నియోజకవర్గ ఇన్‌చార్జీలు వినయ్‌రెడ్డి, సునీల్‌రెడ్డి, రాష్ట్ర అధికార సలహాదారులు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ, జువ్వాడి నర్సింగరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. కొంతమందిని ఆయన సమక్షంలో చేర్పించగా మరికొంతమందిని జిల్లాకు వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో చేర్పించారు. బీఆర్‌ఎస్, ఇతర పార్టీల నుంచి వచ్చేవారిని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేర్పిస్తున్నారు. ఎన్నికలకు ఉపయోగపడేలా రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, శాసనసభవ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో బోధన్ షుగర్‌ఫ్యాక్టరీని ఐదురోజుల క్రితం పరిశీలించి పునరుద్ధరణకు హామీలిచ్చారు.

పోటాపోటీగా కార్యక్రమాలు

కాంగ్రెస్, బీజేపీ నేతలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్ పార్ల మెంట్ పరిధిలో బలంగా ఉన్న కార్యక్రమాలను చేపట్టడం లేదు. పార్లమెంట్‌పై ఆపార్టీ నేతలు పోటీచేసే అభ్యర్థిపై నిర్ణయం తీసుకోకున్నా క్యాడర్ చేజారకుండా చర్యలు చేపట్టడంలేదు. గడిచిన 15రోజుల్లో జడ్పీ వైస్ ఛైర్మన్‌తోపాటు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లాలో బీఆర్‌ఎస్‌కు బలమైన నేతలు ఉన్నారు. పార్లమెంట్ పరిధిలో మాజీమంత్రి ప్రశాంత్‌రెడ్డి, డాక్టర్ కే.సంజయ్, డాక్టర్ సంజయ్‌కుమార్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ కంటే అధికంగా ఓట్లు ఏడు నియోజకవర్గాల పరిధిలో బీఆర్‌ఎస్‌కు వచ్చాయి. రాష్ట్రంలో కీలకపాత్ర పోషిస్తున్న ఎమ్మెల్సీ కవిత కూడా జిల్లానుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరి కాకుండా మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, జీవన్‌రెడ్డి, బిగాల గణేష్‌గుప్తా, షకీల్‌అమీర్‌లు ఉన్నారు. వీరికి బలమైన క్యాడర్ ఉన్నా పార్లమెంట్ ఎన్నికల పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంలేదు. నియోజకవర్గాల పరిధిలో సమన్వయం చేసేవారు లేకపోవడంతో ఎక్కువమంది చేజారుతున్నారు. అయితే ఒకటి, రెండు రోజుల్లో కార్యక్రమాలు చేపట్టి క్యాడర్‌కు దిశానిర్దేశం చేసే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 57 పరీక్షా కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు: డీఐఈవో



నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగనున్నాయి. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 57 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 16 ప్రభుత్వ, 2 ఎయిడెడ్, 2 సాంఘిక సంక్షేమ, 6 మోడల్, 2 మైనార్టీ రెసిడెన్షియల్, ఒక బీసీ సంక్షేమ, 26 ప్రైవేటు జూనియర్ కళాశాలలు, ఒక ప్రభుత్వఉన్నత పాఠశాల, ఒక ప్రైవేటు పాఠశాలల్లో పరీక్షా కేంద్రాల కోసం వినియోగిస్తున్నారు. జిల్లాలో మొత్తం 35 వేల 346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం జనరల్ విద్యార్థులు 14వేల 965 మంది కాగా, 2,399 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. ద్వితీయ సంవత్సరం రెగ్యూలర్ జనరల్ విద్యార్థులు 13వేల 986 మంది పరీక్షలు హాజరుకానుండగా, ప్రైవేటు 1804 మంది, వొకేషనల్ రెగ్యూలర్ 1999 మంది, ప్రైవేటు వొకేషనల్ 193 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. నిమిషం నిబంధన అమల్లో ఉండనుంది. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలో అనుమతించమని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖ అధికారి రఘురాజ్ తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులంతా ఉదయం 8గంటల వరకు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని 8.30ల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబడదన్నారు. పరీక్షలు రాసే విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి చేరుకునే విధంగా సమయానికి బస్సులు నడిపేలా ఆర్టీసీ అధికారులను కోరామని అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద వైద్య, ఆరోగ్య సిబ్బందిని, మంచినీరు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని అదే విధంగా పరీక్ష జరిగే సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామన్నారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా మూడు సిట్టింగ్ స్క్వాడ్, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్ల ద్వారా పరీక్షలకు అనుమతి ఉంటుందని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు రాసుకోవచ్చన్నారు. ప్రైవేటు కళాశాలల్లో హాల్‌టిక్కెట్లు ఇవ్వని పక్షంలో ఇంటర్నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్ల ద్వారా పరీక్షకు హాజరుకావచ్చని ప్రిన్సిపాల్ సంతకం అవసరం లేదన్నారు. పరీక్షల నిర్వహణపై డీఐఈవో మంగళవారం సాయంత్రం ఫ్లయింగ్‌స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో సమావేశమయ్యారు.

ప్రారంభమైన లక్ష్మీ గణపతి ఆలయ మహోత్సవాలు

రుద్రూరు, ఫిబ్రవరి 27: రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వాలు ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా మంగళవారం రుద్రూరులోని పలు పురవీధులలో డప్పు వాయిద్యాలతో, మహిళలు మంగళ హారతులతో స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా యజ్ఞం, హోమం, గోమాత పూజ, ప్రతి ష్ఠాపన చేసే విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బద్దం సంజీవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అన్న దాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈనెల 28న నిజామా బాద్ వారిచే భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 29న నిర్వ హించే విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాన్సు వాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బీబీపాటిల్, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ ఊరేగింపులో ఆలయ కమిటీ సభ్యులు బాపూరావు, వంజరి గంగాధర్, సుభాష్, కుర్లెం భీంరావు, కాసుల శ్రీనివాస్, వంజరి బాలు, వంజరి భీమ్‌కుమార్, కుర్లెంపవన్, ప్రవీణ్,మహిళలు,భక్తులు పాల్గొన్నారు.


రుద్రూర్‌లో శ్రీ లక్ష్మీ గణపతి ఆలయం

నేడు ఖిల్లా డిచ్‌పల్లికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాక

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 27: డిచ్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో 1985-86 సంవత్సరంలో 10వతరగతి పూర్తి చేసి తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖలో ఇంజనీర్ చీఫ్‌గా పనిచేస్తున్న మోహన్ నాయక్ పాఠశాల విద్యార్థుల కోసం 1లక్ష రూపాయల విలువైన స్కూల్ బ్యాగులు, ప్లేట్లు, వాలీ బాల్స్, హాకీ స్టిక్స్, పరీక్ష ప్యాడులు, పంపిణీ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డా.రేకుల పల్లి భూపతిరెడ్డి హాజరుఅవుతున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 10వతరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహన ఉంటుందని, ఎమ్మెల్యే హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అర్గుల్‌లో ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి27: మండలంలోని అర్గుల్ గ్రామంలో లక్ష్మీ వెంకటేశ్వ స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి కల్యాణో త్సవాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారి పల్లకిని ఆలయం నుంచి హనుమాన్ ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించ గా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. వేద పండి తులు ఆశ్చర్యతేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో జాతర ఉత్సవాలను నిర్వహి స్తున్నారు. ఈ కార్యక్రమంలో తాజామాజీసర్పంచ్ గోర్త పద్మ, తాజామాజీ ఉపసర్పంచ్ గోర్త రాజేంధర్, వీడీసీచైర్మన్ రాజారెడ్డి, కోశాధి కారి మురళీ, బోర్ర నర్సారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో 17 సీట్లూ బీజేపీ గెలవాలి

హైదరాబాద్ సీటును కూడా కైవసం చేసుకోవాలి.. అసదుద్దీన్ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలి

- విజయ సంకల్ప యాత్రలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/కార్వాన్/నిజామాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని 17 లోక్‌సభ స్థానాల్లోనూ బీజేపీ గెలవాలని, మజ్లిస్ సీటును కూడా కైవసం చేసుకుని అసదుద్దీన్ ఒవైసీ పార్లమెంటుకు వెళ్లకుండా అడ్డుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాసామ్యానికి, అభివృద్ధికి వ్యతిరేకంగా మజ్లిస్ పార్టీ పనిచేస్తుందని, మెట్రో రైలు ప్రాజెక్టును అడ్డుకుంటుందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే దాని పంచన చేరి పోలీసు వ్యవస్థను తన ఆధీనంలో పెట్టుకుంటుందని విమర్శించారు. మంగళవారం కిషన్ రెడ్డి హైదరాబాద్‌లో రెండో రోజు విజయ సంకల్ప యాత్ర నిర్వహించారు. గుడిమల్కాపూర్ జైన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్వాన్, గోషామహల్, చార్మినార్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో యాత్ర కొనసాగింది. జుమ్మేరాత్ బజార్‌లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీకి ముఖ్యంగా హైదరాబాద్ లోక్‌సభ సీటు గెలవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో 12 లక్షల కోట్ల అవినీతి జరిగిందని, మోదీ ఒక్క రూపాయి కూడా అవినీతి లేకుండా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశ ప్రతిష్ఠను పెంచారన్నారు. రాష్ట్రంలో 17 లోక్‌సభ, 114 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 5500 కిలోమీటర్ల మేర ఐదు విజయ సంకల్ప యాత్రలు కొనసాగుతాయని తెలిపారు. వచ్చే నెల 2వ తేదీతో ముగుస్తాయన్నారు. మోదీ మళ్లీ ప్రధాని కావాలని ఈ యాత్రలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కాగా, నిజామాబాద్ జిల్లా బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ నియోజకవర్గాల్లో జరిగిన యాత్రలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పాల్గొన్నారు. కేంద్రంలో మూడోసారీ బీజేపీయే అధికారంలోకి వస్తుందని, మోదీ మళ్లీ ప్రధాని అవుతారని ఆమె ధీమా వ్యక్తం చేశారు. మోదీ రైతుల కోసం పసుపు బోర్డు ఏర్పాటు చేసి హామీ నెరవేర్చారన్నారు. కాంగ్రెస్ పార్టీ నామమాత్ర మెజారిటీతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పటికీ ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు ఆదరణ లేదని, కేంద్రంలో ఆ పార్టీ అధికారంలోకి రావడం కలేనని వ్యాఖ్యానించారు.



విజయ సంకల్ప యాత్రలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ మాట తప్పింది

- ఫీజు లేకుండా క్రమబద్ధీకరించాలి
- తాగునీటిలోనూ లాభం వెతుకుతారా?
- ఇలాంటి వ్యక్తి సీఎం కావడం దురదృష్టకరం
- ప్రభుత్వమంటే రియల్ వ్యాపారం కాదు: హరీశ్



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే ఎల్‌ఆర్‌ఎస్‌ను రద్దు చేస్తామని, ఉచితంగా స్థలాలను క్రమబద్ధీకరిస్తాం అంటూ ప్రజలను రెచ్చగొట్టిన కాంగ్రెస్.. ఇపుడు మాట తప్పి ఫీజు వసూలు చేసేందుకు సిద్ధమైందని మాజీ మంత్రి టి.హరీశ్ రావు ఆరోపించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ఎల్‌ఆర్‌ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని, లేదంటే మోసపూరిత హామీ ఇచ్చినందుకు ప్రజలకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై మాట మార్చడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని.. ఇది వారి మోసపూరిత విధానాలకు నిదర్శనమని విమర్శించారు. ఆ పార్టీ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. గతంలో చేసిన ప్రకటనలకు అనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎలాంటి ఫీజులు లేకుండా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు..ప్రజలకు అందించే స్వచ్ఛమైన తాగునీటిలోనూ లాభం వెతుకుతారా..? మిషన్ భగీరథ పథకంలో లాభం వెతికే వ్యక్తి ముఖ్యమంత్రి కావడం మన దురదృష్టమని హరీశ్‌రావు పేర్కొన్నారు. భగీరథ ద్వారా ఏం లాభం తెచ్చారని.. దానికోసం తెచ్చిన అప్పుపై వడ్డీ ఎలా కడతారని ఆయన ప్రశ్నించడం అంతకన్నా దౌర్భాగ్యం, భావదారిద్ర్య ఆరోపణ మరొకటి ఉండద మంగళవారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.ప్రభుత్వమంటే రియల్ ఎస్టేట్ వ్యాపారం కాదు.. ప్రజా సంక్షేమంలో లాభనష్టాలు చూసుకోరని రేవంత్‌రెడ్డిపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. మిషన్ భగీరథ పథకాన్ని ప్రజల ఆరోగ్యం కాపాడిన గొప్ప సంజీవనిగా చూడాలని.. అందులో లాభనష్టాలు బేరీజు వేసుకోవడం ఒక ప్రభుత్వాధినేతకు తగదని హితవుపలికారు. ఆసరా పెన్షన్ల ద్వారా కూడా రూ.వేలకోట్లు ఖర్చవుతుంది. దాని వల్ల కూడా లాభం లేదంటారా..? అని ప్రశ్నించారు.

మీ ఎత్తు గురించి నేను మాట్లాడితే..!

'ఇటీవల పలు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి నా ఎత్తు గురించి వ్యాఖ్యానిస్తున్నారు. నేను కూడా మీ (సీఎం రేవంత్‌ను ఉద్దేశించి) ఎత్తు గురించి మాట్లాడితే సంస్కారవంతంగా ఉండదు. ఎవరి ఎత్తు ఎంత అనేది ప్రజలకు అవసరం లేదు. ప్రజల కోసం ఎవరు ఎంతమేరకు ఆలోచిస్తున్నారో.. ఎవరెంత పనిచేస్తున్నారో.. మాత్రమే వారికి అవసరం' అని హరీశ్‌రావు వెల్లడించారు.

కాంగ్రెస్ వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామన్నారు కదా?: టీఆర్‌ఏ

ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్న ముఖ్యమంత్రితోపాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని ప్రకటనలు చేశారని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ (టీఆర్‌ఏ) అధ్యక్షుడు నారగోని ప్రవీణ్ కుమార్ గుర్తు చేశారు. "గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కింద రుసుము వసూలుకు ప్రతిపాదనలు చేస్తే.. లేఅవుట్ రెగ్యులేషన్ స్కీమ్ లాగే మ్యారేజ్ రెగ్యులేషన్ స్కీమ్ కూడా తీసుకొస్తారేమో అని గతంలో రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇప్పుడేమో సీఎం హోదాలో అదే పథకాన్ని అమలు చేసేందుకు రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేయాలని తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేయగా గతంలో కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. ఇప్పుడు ఇదే ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ తెరమీదకు తెచ్చి మార్చి 31లోగా గడువు విధించి రెగ్యులరైజేషన్ చేయించుకోవాలని చెప్పడం సమంజసంగా లేదు" అని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లిని అడ్డు పెట్టుకొని రాజకీయాలు

పొన్నం తల్లిని నేను అవమానించలేదు.. యాత్రను ఆపేయాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టం

- హామీల అమలును ప్రశ్నిస్తే దాడులా?
- నేను ఓడిపోతే.. రాజకీయ సన్యాసం
- కాంగ్రెస్ ఓడితే పొన్నం తప్పుకుంటారా?
- కేటీఆర్‌తో బీఆర్‌ఎస్..

పొన్నంతో కాంగ్రెస్ నాశనం: సంజయ్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: కన్న తల్లిని అడ్డుపెట్టుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజకీయం చేయాలనుకుంటున్నాడని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు. 'రాముడు అయోధ్యలోనే పుట్టాడా..?' అని అడిగిన వారిని ప్రశ్నించాను తప్ప.. పొన్నం తల్లిని ఉద్దేశించి అనలేదని వివరణ ఇచ్చారు. అందరు తల్లులు తన తల్లితో సమానమని.. ప్రభాకర్ తల్లిని తాను అవమానించలేదని స్పష్టం చేశారు. తాను అంత సంస్కారహీనుడిని కానని అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ వచ్చేలోగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే.. అడుగడుగునా నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. హామీల అమలుకు ఇంకా 20 రోజులే గడువు ఉందన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికే పథకాలు ఇస్తామని చెబుతున్నారని.. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. తాను హామీల అమలును ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ దాడులు చేయించడం ఏంటని ప్రశ్నించారు. పొన్నం ప్రభాకర్ ఏమీ చేయలేదు కాబట్టే గత ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానం వచ్చిందని తెలిపారు. అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అని ఆయన అన్నది వాస్తవం కాదా..? అని ప్రశ్నించారు. ప్రజాహిత యాత్రను ఆపాలనుకుంటే కాంగ్రెస్‌కే నష్టమని హెచ్చరించారు. కేసీఆర్ పదేళ్లలో రూ.5 లక్షల కోట్ల అప్పు చేస్తే, కాంగ్రెస్ 2 నెలల్లో రూ.10వేల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. తల్లిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నందుకు స్వర్గంలో ఉన్న పొన్నం తల్లి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని సంజయ్ అన్నారు. అయితే, పక్కనే ఉన్న నాయకులు పొన్నం తల్లి బతికే ఉందని.. తండ్రి చనిపోయాడని తెలిపారు. దీంతో పొరపాటును గుర్తించిన సంజయ్.. పొన్నం తండ్రి ఆత్మ ఎంత క్షోభిస్తుందోనని అన్నారు. ఆయన తల్లి నూరేళ్లు ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షించారు. 'రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రికి సవాల్ విసురుతున్నా.. నేను నా విశ్వాసాలతో రాముడి పేరిట ఎంపీ ఎన్నికల్లో నిలుచుంటా. నువ్వు నీ వాదనతో అభ్యర్థిని నిలబెట్టు. నేను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా. మళ్లీ రాముడని, హిందూ మతమని మాట్లాడను. మీ అభ్యర్థి ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటావా..?' అని బండి సంజయ్ పేర్కొన్నారు. కేటీఆర్‌తో బీఆర్‌ఎస్ నాశనమైందని, పొన్నం లాంటి వారితో కాంగ్రెస్ నాశనమవుతుందని పేర్కొన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్ బియ్యం ఇస్తుంటే మీ ఫొటోలు పెట్టుకుంటారా.. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా బియ్యం ఇస్తోందని, ఇక్కడికి బియ్యం పంపవద్దని ప్రధాని మోదీకి లేఖ రాస్తా' అని అన్నారు.



ప్రజాహిత యాత్ర బహిరంగ సభలో సంజయ్

సంజయ్ క్షమాపణ చెప్పాలి

కాంగ్రెస్ శ్రేణుల డిమాండ్

పాదయాత్ర శిబిరాన్ని ముట్టడించే యత్నం

చిగురుమామిడి/హుస్నాబాద్ రూరల్: సంజయ్ చేపట్టిన ప్రజాహిత యాత్ర మంగళవారం ఉద్రిక్త వాతావరణంలో సాగింది. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సంజయ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని హుస్నాబాద్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. సంజయ్ ప్రజాహిత యాత్రను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో సోమవారం రాత్రి సంజయ్ బస చేశారు. మంగళవారం ఉదయం అక్కడికి తరలి వచ్చిన కాంగ్రెస్ నాయకులు సంజయ్ బస చేసిన శిబిరాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించారు. అక్కడ ఉన్న బీజేపీ నాయకులు వారిని ప్రతిఘటించారు. పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. దీంతో ఉల్లంపల్లి శివారులోని ప్రధాన రహదారిపై కాంగ్రెస్ కార్యకర్తలు బైఠాయించారు. కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం కరీంనగర్ జిల్లా సరిహద్దు నుంచి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలోని రాములపల్లి వరకు పాదయాత్రను పోలీస్ బందో బస్తుతో తీసుకెళ్లారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. కరీంనగర్‌లో రాస్తారోకో చేశారు. పలుచోట్ల సంజయ్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఎంపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాహిత యాత్ర మంగళవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి వస్తున్న క్రమంలో సంజయ్‌కి స్వాగతం పలుకుతూ బీజేపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై కాంగ్రెస్ కార్యకర్తలు అనుచిత రాతలు రాశారు. దీనిపై బీజేపీ నేతలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యాత్ర పేరిట 'బండి' రాజకీయ డ్రామాలు

- నా తల్లిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు
- ఎంపీగా అయిదేళ్లలో ఏం చేశారో చెప్పాలి
- సంజయ్ ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు : మంత్రి పొన్నం



హైదరాబాద్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి)/హుస్నాబాద్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ రాజకీయ డ్రామాలతో ప్రజాహిత యాత్ర చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తన తల్లిపై బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై మండిపడ్డారు. ఎంపీగా ఐదేళ్ల పదవీ కాలంలో సంజయ్ కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నిస్తే.. ఆయన తన తల్లి జన్మకు సంబంధించి వ్యాఖ్యలు చేశారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేవలం ప్రచారం కోసమే సంజయ్ తన యాత్రను కాంగ్రెస్ అడ్డుకున్నట్లు డ్రామాలకు తెరలేపారన్నారు. తాము వాళ్ల యాత్రలు అడ్డుకోవడం లేదని, ప్రజాస్వామ్యంలో యాత్ర చేసే హక్కు అందరికీ ఉంటుందని, కానీ అవివేకమైన మాటలు సరికాదని విమర్శించారు. తనకు శ్రీరాముడు అంటే గౌరవం అని, ఏనాడు శ్రీరాముడి గురించి కాని, అక్షింతల గురించి గాని మాట్లాడలేదని, ఒకవేళ మాట్లాడినట్లు నిరూపిస్తే సజీవ సమాధికి సిద్ధమని సవాల్ విసిరారు. తన మాటలను వక్రీకరించి రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. శ్రీరాముని పేరు మీద ఓట్లు అడగడం కాదు.. అయిదేళ్ల కాలంలో కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ నియోజకవర్గ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంజయ్ వ్యాఖ్యలపై బీజేపీ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ఆలోచించాలన్నారు. ఇలాంటి నాయకుని డ్రామాలను సమర్థిస్తున్నారా..? అని ప్రశ్నించారు. సంజయ్ ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని మంత్రి హెచ్చరించారు.

చదువుల తల్లికి పుట్టినిల్లు బోధన్

- లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27: చదువుల తల్లికి పుట్టినిల్లు బోధన్ అని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్ష్మీ అన్నారు. బోధన్ పట్టణంలోని ఇందూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆమె మాట్లాడుతూ ఎక్కడెక్కడి నుండో విద్యార్థులు ఇక్కడకు వచ్చి ప్రాథమిక విద్యను అభ్యసించి అనేక రంగాలలో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారన్నారు. చదువుల తల్లి బోధన్ పుట్టినిల్లు లాంటిదని అభివర్ణించారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తులో ఎదుర్కొన్న పెనుసవాళ్లకు దీటుగా తీర్చిదిద్దుతున్నా మని పేర్కొన్నారు.విద్యార్థులు సాంకేతిక రంగాలలో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పెట్టాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో ఇందూర్ విద్యా సంస్థల కరస్పాండెంట్ కొడాలి కిషోర్‌కుమార్, లయన్స్ ప్రముఖులు లయన్ అమర్‌నాథ్ రావు, నరసింహారాజు, మర్రి ప్రవీణ్, లయన్స్ బసవేశ్వరరావు, లయన్స్ శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, సూర్యనారాయణ, లావణ్యలక్ష్మీ, మండల విద్యాశాఖ అధికారి నాగ్‌నాథ్, పాఠశాల డైరెక్టర్ కృష్ణారావు, హెచ్‌ఎంఏఎస్ రామారావు, ప్రైమరీ హెడ్ మాస్టర్ సుధారాణి, అడ్మినిస్ట్రేవ్ ఇన్‌చార్జి స్వాతిలతోపాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎరాజ్‌పల్లిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్, డీపీవో



నర్సరీని పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 27: బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామాన్ని మంగళవారం ట్రైనీ ఐఏఎస్ అధికారిణి కిరణ్మయి, డీపీవో తరుణ్‌కుమార్‌లు సందర్శించారు.ఈసందర్భంగా గ్రామపంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. గ్రామాభివృద్ధిలో భాగంగా నర్సరీలను, గ్రామంలోని పలు వార్డులను సందర్శించారు.గ్రామాభివృద్ధి వివరాలు సేకరించారు.ఈకార్యక్రమంలో డీఎల్‌పీవో సాయిబాబా,తహసీల్దార్ గంగాధర్,ఎంపీడీవో వెంకటేష్‌జాదవ్, ఎంపీవో మధుకర్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హరితహారం మొక్కల పెంపకానికి చలువ పందిళ్లు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 27: నడిపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా 3500 మొక్కలు నాటారు. వేసవి తీవ్రత రోజురోజుకు అధికమవుతున్న కారణంగా మొక్కల పెంపకం కోసం చుట్టూ చలువ పందిళ్లు ఏర్పాటు చేసి వాటి సంరక్షణకు ఎప్పటికప్పుడు నీటిని అందిస్తూ పంచాయతీ ఈవో కిషన్‌రావు విలేకర్లతో తెలిపారు.

పల్స్ పోలియోపై అవగాహన

మోస్రా,ఫిబ్రవరి27: మోస్రా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెల 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందన్నారు. 0-5సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయాలని, మార్చి 4వ తేదీన ఇంటింటికి తిరుగుతూ పోలియో చుక్కలు వేయాలని ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సాయమ్మ, ఏఎన్‌ఎం తనూజ, భాగ్య, బేబీ రాణి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మళ్లీ కుట్ర రాజకీయాలు చేస్తోంది

- బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న డీకే అరుణ

భీమ్‌గల్ రూరల్, ఫిబ్రవరి27: బీజేపీ, బీఆర్‌ఎస్ ఒకటే అంటూ తప్పుడు ప్రచారంతో మళ్లీ కాంగ్రెస్ గెలవాలని చూస్తుందని, లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో కాగ్రెస్ పార్టీ కుట్ర పూరిత రాజకీయాలు చేస్తుందని, రాహుల్ గాంధీకి ప్రధాని అయ్యే అవకాశం లేదని బీజేపీ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. మంగళవారం భీమ్‌గల్ మున్సిపాలిటీలో బీజేపీ విజయ సంకల్పయాత్ర బస్సురోడ్డు షో నిర్వహించారు. ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తోనే దేశం అభివృద్ధి పథంలో ముదుంకు వెళ్తుందని, కరోనా కష్ట కాలంలో నేనున్నాని ప్రతి పేదవాడికి గుర్తుంచుకునేలా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముందుండి నిలబడ్డాడని అన్నారు. తెలంగాణాలో సావుతప్పి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అబద్దాల ఆరుగ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి గెలిచారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అర్వింద్ కమలం పువ్వుకు ఓటువేయాలని అన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి,నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ,ఎంపీ ధర్మపురి అర్వింద్,పెద్దోళ్లగంగారెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

మోర్తాడ్: మోర్తాడ్ బీజేపీ సంకల్ప రథయాత్రకు మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. మంగళవారం మోర్తాడ్‌కు విచ్చేసిన రథయాత్రకు స్వాగతం పలికి బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డికె.అరుణ, ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్యనారాయణగుప్తా స్థానిక మండల నాయకులు స్వాగతం పలికి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ బీజేపీ ఇన్ చార్జీ ఏలేటి మల్లి కార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దినేష్ కుల చారి, జిల్ల నాయకులు, మండల బీజేపీ అధ్యక్షులు పుప్పాల నరేష్, బోగ దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: దేశ ప్రజల, రైతుల, మహిళల అన్నివర్గాల అభివృద్ధి కోసం నరేంద్రమోదీ దేశాన్ని ప్రణాళికబద్ధంగా 2047 కల్ల వికసిత్ భారత్ సంకల్పంతో భారత దేశాన్ని ప్రపంచదేశా అభివృద్ధి చెందిన దేశాల్లో మొట్టమొదటిదేశంగా నిలపడానికి ప్రధాని నరేంద్రమోదీ కృషిచేస్తున్నారని ఈసారి ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు తెలపాలని బీజేపీ జాతీయఅధ్యక్షురాలు, మాజీ మంత్రి డికే అరుణ అన్నారు. కేంద్రమంత్రి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పాలమూరు పార్లమెంట్ నుంచి ప్రారంభించిన విజయ సంకల్పయాత్ర మంగళవారం జిల్లా సరిహద్దులోకి ప్రవేశించగా బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడు దినేష్ కులచారి, పల్లె గంగారెడ్డి, పలువురు బీజేపీ జిల్లా, మండల నాయకులు గండిహనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యేధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు, వివిధ గ్రామాల పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

సిరికొండ: విజయ్ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం సిరికొండ మండలం పెద్దవాల్గోట్ గ్రామంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కె అరుణ ఎమ్మెల్యేలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. వాల్గోట్ గిర్ని వద్ద నూతనంగా ప్రతిష్ఠించిన ఎల్లమ్మ తల్లిని ఎమ్మెల్యేలు పైడి రాకేష్‌రెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా దర్శించుకుని పూలు చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, మండల అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, మండల నాయకులు రంజిత్‌రెడ్డి, గంగమురళి, సంద్ర శంకర్, తదితరులు పాల్గొన్నారు.

తండాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తాం

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

మాక్లూర్, ఫిబ్రవరి27: గిరిజనులు ప్రకృతితో మమేకం అవుతూ ఉపాధి పొందుతారని వారి అభివృద్ధి కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడి గ్రామంలో సంత్‌సేవలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తండా మహిళలు సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. సేవలాల్ మహరాజ్ విగ్రహానికి జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావుతో కలిసి రాకేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలలో రోడ్లు, డ్రైనేజీలు సకల సౌకర్యాలు ఉండేలా రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. అనంతరం మండలంలోని మామిడిపల్లి గ్రామశివారులో గల అపురూప వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అనాధికారులతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి27: పట్టణంలోని వెటర్నరీ ఆసుపత్రి పరిధిలో మంగళవారం వెటర్నరీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ జీయావుద్దిన్ పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలను వేశారు. కొన్ని రకాల వ్యాధుల వల్ల పందుల నుంచి మనుషులకు వచ్చే అవకాశం ఉన్నందున 98పందులకు స్వైన్‌ఫ్లూ టీకాలు ఉచితంగా ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యాధి నిర్ధారణ కేంద్రం నుంచి అసిస్టెంట్ డైరెక్టర్ బస్వారెడ్డి వచ్చి పశువుల నుంచి వివిధ రకాల వ్యాధుల నిర్ధారణ కొరకు రక్తనమూనాను సేకరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రోజశ్రీ, పవన్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తప్పవు

ముప్కాల్, ఫిబ్రవరి27: నిబంధనలకు విరుద్ధంగా రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠినచర్యలు తప్పవని ఎస్సై భాస్కరచారి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో తరచు ప్ర మాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి కష్టించే రైతు పెట్టుబడి సాయం కోసం చూడలే తప్ప ప్రమాదాలకు కారణం కావొద్దని ఆయన సూచించారు. పదేపదే నోటీసులు ఇచ్చినప్పటికీ రైతులు మానడంలేదని, రోడ్డుపై యదేచ్చగా పంట నూర్పిళ్లు, ధాన్యం ఆరబోత సరైందికాదని పేర్కొన్నారు. ప్రమాదాలకు కారణమైన సంబంధిత రైతులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ధర్మారం(బి) గురుకుల పాఠశాలలో హాల్ టికెట్ నంబర్లు వేయిస్తున్న సిబ్బంది

కోటగిరి,ఫిబ్రవరి27: కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కళాశాల సీఎస్ రిజ్వానా సమీర్ తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 208మంది విద్యార్థులు, వొకేషనల్ విభాగంలో 44మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరంలో 179మంది విద్యార్థులు, వొకేషనల్‌లో 45మంది విద్యార్థులు పరీక్ష రానున్నారని ఆమె తెలిపారు. విద్యార్థులు 8గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని ఆమె పేర్కొన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం అయిన విద్యార్థులను పరీక్ష హాలులోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

డిచ్‌పల్లి: నేటి నుంచి ఇంటర్మిడియేట్ వార్షిక పరీక్షలు ప్రారం భం కానున్నాయని నిర్వాహకులు తెలిపారు. డిచ్‌పల్లి మండలంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండ్ అధికారులు తెలిపారు. ప్రభుత్వ జూనియన్ కళాశాలతో పాటు ఎస్‌పీఆర్ కళాశాల, ధర్మారం(బి) గురుకుల కళాశాల, మోడల్ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయ నున్నారని ఇందుకోసం పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సూపరిం డెంట్ తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రానికి హాజరు కావాలని కోరారు. ధర్మారం గురుకుల పాఠశాల 355 విద్యార్థులు, ఆదర్శపాఠశాల డిచ్‌పల్లి 392మంది, విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని వారు పేర్కొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

బోధన్ రూరల్, ఫిబ్రవరి 27: బోధన్‌లో బీఆర్‌ఎస్‌కు వరుసగా భారీ షాక్‌లు తగులుతున్నాయి. బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. మంగళవారం బోధన్ మండలం కల్దుర్కి సొసైటీ చైర్మన్, జిల్లా డీసీసీబీ డైరెక్టర్ శరత్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెర వేర్చడంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉందన్నారు. రూ.500కేగ్యాస్ సిలిండర్, 200యూనిట్ల ఉచిత కరెంట్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఎన్ని కల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుచేస్తామన్నారు.ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు,సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనా ర్ధన్,సిద్ధాపూర్ సర్పంచ్ అశోక్‌పటేల్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్‌రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.

జాకోర విండో ఉపాధ్యక్షుడిపై వీగిన అవిశ్వాసం

వర్ని,ఫిబ్రవరి27: వర్ని మండలం జాకోర విండో ఉపాధ్యక్షులు గఫర్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి ప్రకటించారు. గఫర్‌పై అవిశ్వాసం పెట్టడంతో ఉదయం 11గంటలకు ప్రత్యేక సమావేశంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంకు ఒక్క సభ్యుడు కూడా హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగినట్లు వెల్లడించారు.

పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

• అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్



హాజరైన సీఎస్‌డీవోలు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల నిర్వహణపై మంగళవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో సీఎస్‌డీవోలతో సమావేశం నిర్వహించారు. ఎక్కడ కూడా పొరపాట్లకు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆయన వారికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా 22వేల 274 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, 143 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ తెలిపారు. మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ప్రతి రోజు ఉదయం 9.30ల నుంచి 12.30ల వరకు పరీక్షలు నిర్వహిస్తామని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మాస్‌కాపీయింగ్‌కు అవకాశం లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో మంచినీటితో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేలా చూడాలన్నారు. ఎక్కడ కూడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు

ప్రణాళికతో కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుంది

ధర్పల్లి, ఫిబ్రవరి 27: ప్రణాళికతో విద్యార్థులు కష్టపడితే విజయం తప్పకుండా వరిస్తుందని వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రొఫెసర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోగల హంసవాహిని పాఠశాలలో ఎస్సెస్సీ విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలకు విద్యార్థులు ఎలా సంసిద్ధం కావాలో సూచించారు. లక్ష్యాన్ని నిర్ణయించుకొని లక్ష్యంవైపు ప్రయాణించాలని సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పురుషోత్తం, రాజేశ్వర్, చక్రవర్తి, మాన్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

దేశాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

పెద్దబజార్, ఫిబ్రవరి 27: బీఆర్ఎస్ బానిస సంకెళ్లు తెంచుకొని నరేంద్రమోదీ నాయకత్వంలో వికసిస్తున్న భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంపీ ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం నగరంలోని 17, 37 డివిజన్‌లకు చెందిన మున్సిపల్ కార్పొరేటర్లు సవిత, రాజు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సాయిరాం బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మరోసారి మోదీ సర్కారు కోసం దేశ ప్రజలందరూ రాముడిని వేడుకుంటున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో మన ఇందూరులో కచ్చితంగా కాషాయ జెండా ఎగరవేయడం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. మోదీ అమలు చేస్తున్న సం క్షేమ పథకాలను చూసి ఆకర్షితులై బీజేపీలో చేరడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి27: జిల్లా కేంద్రంలోని గూపన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. మంగళవారం పాఠశాలలో 8,9,10 తరగతి చదువుతున్న 55 మంది విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించారు. పిల్లల్లో రక్తహీనత లక్షణాలున్నాయని, శరీరం పెరుగుదలకు పోషకాహారం తీసుకోవాలని వైద్యులు సూచించారు. సరైన ఆహారం తీసుకోకపోతే రక్తహీనత వంటి జబ్బులు వచ్చేఅవకాశం ఉందని పిల్లలకు వివరించారు. ఏయే ఆహారంలో ఎలాంటి పోషకాలు లభిస్తాయో పిల్లలకు అర్థమయ్యేలా సూచించారు. పిల్లలకు మల్టీ విటమిన్ ట్యాబెలెట్స్ అందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఘనపురం దేవేందర్, శకుంతల దేవి, జయసాగర్, మంజులత, శ్రీరామలక్ష్మణ్ తదితరులున్నారు.

'బీడీల తయారీకి నాణ్యమైన ఆకు, తంబాకు ఇవ్వాలి'

పెద్దబజార్, ఫిబ్రవరి27: బీడీల తయారీకి నాణ్యమైన ఆకు, తంబాకు ఇవ్వాలని తెలంగాణ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీడీ కార్మికుల యజమానుల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెయ్యి బీడీలకు రూ.807 ఇవ్వాలని, ప్యాకర్స్, ట్రైపిల్లర్స్ నెల వేతనాలు పొందే కార్మికుల కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలన్నారు. క్లర్క్, చెకర్స్, బట్టీ కార్మికులు నెలసరి వేతనాలు పొందే విధంగా వివిధ కేటగిరిల కార్మికులందరికి కనీస వేతనం 26వేలు ఇవ్వాలన్నారు. నెలకు 26 రోజుల పని కల్పించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ చట్టాలను విధిగా అమలు చేయాలన్నారు. బీడీ కార్మికులకు గతంలోనూ వేతనాలు పెంచే విషయంలో అటు ప్రభుత్వం కానీ ఇటు యజమానులు కానీ సరైన న్యాయం చేయలేదని అన్నారు. అరకొర వేతనాలు పెంచి బీడీ కార్మికులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాలస్వామి, ఉపాధ్యక్షులు నూర్జహాన్, కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆలోచనలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

సిరికొండ, ఫిబ్రవరి 27: శాస్త్రీయ ఆలోచనలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని సిరికొండ ఎస్సై గోకల రమేష్ అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా సత్యాశోధక్ పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను ఎస్సై రమేష్ తిలకించారు. భౌతిక శాస్త్రవేత్త నోబెల్ బహుమతి గ్రహీత సీజీవీ.రామన్ చిత్రపటానికి ఎస్సై పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో శాస్త్ర, సాంకేతికత సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. విద్యార్థులలో దాగి ఉన్న నిగూఢమైన ప్రతిభను వెలికి తీయడానికి, వినూత్న ఆలోచనలను రేకెత్తించడంలో సైన్స్ పాత్ర ఘననీయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న ఎస్సై రమేష్



సమావేశంలో పాల్గొన్న అధికారులు

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

• డీఈ ఆపరేషన్ శ్రీనివాస్‌రావు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: నిజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఈ ఆపరేషన్ శ్రీనివాస్‌రావు అన్నారు. నగరంలో మంగళవారం ఏడీఈలు, ఏఈలు, స్టాఫ్‌ఫోర్‌మెన్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్లు, జూనియర్ లైన్‌మెన్‌లతో సమీక్ష నిర్వహించారు. నగరం పరిధిలోని 11 కేవీ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను సరి చేసుకోవాలన్నారు. రబీ సీజన్ కావడంతో పంటలకు అంతరాయం లేకుండా సరఫరా చేయాలన్నారు. పోటీ పరీక్షలు, వార్షిక పరీక్షలు జరుగుతున్నందున ఎక్కడ కోతలు లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం పైన కూడా ఆయన వారికి వివరించారు. కార్యక్రమంలో ఏడీఈలు చంద్రశేఖర్, తోటరాజశేఖర్, వీరేశం, ఎం.అశోక్, సుహాసిని, ఏఈలు జాకీర్ అలీ, నగేష్, శ్రీనివాస్, నహాసేవాని, శ్రీవిద్య, గంగాశేఖర్, గయాఅహ్మద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి27: సెపక్‌తక్రా జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదారి సంజీవరెడ్డి తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో లాస్యప్రియ, మన్విత, లాస్య, రిషిత, జూనియర్ బాలికల విభాగంలో శ్రీజ, శ్రేష్ఠ, జూనియర్ బాలుర విభాగంలో ఉదయ్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు. మార్చి 26 నుంచి 30వరకు కర్నాటకలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటారని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై అసోసియేషన్ అధ్యక్షులు కేశవేణు, ఉపాధ్యక్షులు దీపిక, గంగారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరి బాగారెడ్డి, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌కుమార్ అభినందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో నివాస గుడిసెల దగ్ధం

• రూ.6 లక్షల వరకు ఆస్తి నష్టం



కాలిపోయిన నివాస గుడిసెలు

ఇందల్వాయి, ఫిబ్రవరి 27: మండలంలోని లోలం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో రెండు నివాసపు గుడిసెలు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. గ్రామానికి చెందిన సున్నం సత్తెమ్మ, సున్నం భూమయ్యలకు చెందిన నివాసపు గుడిసెలో తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంట్లోని సామగ్రితోపాటు రూ.లక్ష నగదు, పెండ్లి సామాన్లు దగ్ధమయ్యాయని అన్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో వారు వెళ్లి పంచనామా నిర్వహించారు. సున్నం సత్తెమ్మకు చెందిన సుమారు రెండున్నర లక్షల ఆస్థినష్టం జరిగిందని, సున్నం భూమయ్యకు చెందిన మూడున్నర లక్షల ఆస్తినష్టం జరిగిందని అన్నారు. భూమయ్యకు చెందిన రూ.లక్ష నగదు అగ్నికి ఆహుతి అయ్యిందని అన్నారు. భూమయ్య కుమారుడికి ఇటీవలే పెళ్లి కావడంతో పెళ్లి సామగ్రి మొత్తం మంటల్లో బూడిదయ్యిందన్నారు. తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో మంటలను ఆర్పేందుకు త్వరగా ఎవరూ అందకపోవడంతో రెండు గుడిసెలతో పాటు పక్కనే ఉన్న కందాల ప్రశాంత్‌కు చెందిన ఇళ్లు పాక్షికంగా దెబ్బతిందని మంటల తాకిడికి ఇంటి ముఖద్వారం పూర్తిగా కాలినట్లు వారు తెలిపారు. తహసీల్దార్ వెంకట్రావుతో పాటు గిరిదావర్ ప్రసాద్ ఘటన స్థలానికి వెళ్లి బాధితులకు తక్షణ సహాయం కింద 30 కేజీల బియ్యాన్ని అందజేశారు. కట్టుబట్టలతో పాటు మొత్తం ఆస్తి ఆహుతి కావడంతో బాధితులు రోధిస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ధర్పల్లి, ఫిబ్రవరి 27: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కళాశాల సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. మార్చి 14 వరకు పరీక్షలు కొనసాగుతాయని పరీక్షల నియంత్రణ అధికారి సురేష్‌బాబు తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మండల కేంద్రంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 408, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 444 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ఆయన చెప్పారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రానికి అనుమతి లేదని విద్యార్థులు ఈవిషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. 8.30లకు పరీక్షకేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, డిజిటల్, ఎలక్ట్రానిక్ వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడదని తెలిపారు.

'ఈపీఎఫ్ చందాదారుల సమస్యలను పరిష్కరిస్తాం'

ఖిల్లా, ఫిబ్రవరి 27: ఈపీఎఫ్ చందాదారులకు సంబంధించి సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఈపీఎఫ్ అకౌంట్స్ అధికారి ఎ.రాఘవేందర్ అన్నారు. నిజామాబాద్‌లోని శ్రీనగర్‌లో మంగళవారం ఈపీఎఫ్ ఆధ్వర్యంలో నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పీఎఫ్ చందాదారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవడంతోపాటు పేర్ల మార్పిడీ, ఇతర అంశాల మార్పిడికి సంబంధించిన వివరాలను అకౌంట్ ఆఫీసర్ వివరించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పెన్షన్‌దారులకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలు సంస్థల వారు పాల్గొన్నారు.

'కళాశాల కరస్పాండెంట్‌పై చర్యలు తీసుకోవాలి'

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 27: కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థులకు మంచి సందేశాన్ని ఇవ్వాల్సిన కరస్పాండెంట్ వికృత చేష్టలతో డాన్సులు చేస్తూ విద్యార్థులను తప్పుదోవ పట్టించిన బోధన్‌కు చెందిన కళాశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ లాల్‌సింగ్, టీఎస్ఎఫ్ జిల్లాఇన్‌చార్జి మహేష్‌రెడ్డి మంగళవారం డీఐఈవోకు ఫిర్యాదు చేశారు. బోధన్‌లోని ఓ కళాశాల వార్షికోత్సవంలో విద్యార్థులను మంచి మార్గంలో వెళ్లాలని సూచించాల్సిన కరస్పాండెంట్ సుబ్బారావు విద్యార్థుల ముందు డాన్సులు చేస్తూ వారిని తప్పుదోవ పట్టించేలా చేశాడని అతనిపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మార్కండేయ ఆలయంలో కొనసాగుతున్న ఉత్సవాలు

ఖిల్లా, ఫిబ్రవరి27: నగరంలోని కోటగల్లి మార్కండేయ ఆలయంలో మంగళవారం ఉత్సవాల్లో భాగంగా చండీహోమం, రుద్రహోమం, న్యాస హోమం, ఆదివాస హోమం కార్యక్రమాలను నిర్వహించారు. భక్తమార్కండేయ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో పౌరోహితులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షిత్‌లతో పాటు పద్మశాలి సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ పుల్గం హన్మాండ్లు, నగర అధ్యక్షుడు గుజ్జేటి వెంకటనర్సయ్యతో పాటు ఇతరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

• రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి

నిజామాబాద్‌అర్బన్, ఫిబ్రవరి27: దేశంలో శాస్త్రీయ విధానంపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలని, బీజేపీ మనువాద దాడులను తిప్పికొట్టే విధంగా ముందుకు వెళ్లాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న మనువాద దాడులకు వ్యతిరేకంగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చరిత్రలను వక్రీకరిస్తూ కేవలం మనువాద సంస్కృతిని పెంచి పోషించే విధంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు అడుగులు వేస్తున్నాయని, దీన్ని దేశప్రజలు కలిసికట్టుగా ఎదుర్కోవాలన్నారు. కార్మికులనల్లచట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న రైతులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. మార్చి 12న రాష్ట్రవ్యాప్త యూనివర్సిటీ విద్యార్థులతో ముఖాముఖి చర్చ సమావేశాల సందర్భంగా తెలంగాణ యూనివర్సిటీలో ముఖాముఖి చర్చ ఉంటుందని, ఐక్యవిద్యార్థి వేదిక, ప్రగతిశీల విద్యార్థులు, మనువాద సంస్కృతికి వ్యతిరేకంగా పోరాడే ప్రతీఒక్కరు ఈ కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. సమావేశంలో తెలంగాణ స్టేట్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ వినాయకరెడ్డి, జాగో తెలంగాణ కోర్ కమిటీ మెంబర్ ప్రొఫెసర్ పద్మజ, స్టేట్ కమిటీ మెంబర్ నిర్మల, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, జిల్లాఅధ్యక్షుడు నరేందర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం, గణేష్, రాజేశ్వర్, నిఖిల్ పాల్గొన్నారు.



శిక్షణ పొందుతున్న మహిళలు

పోలీసుల ఆధ్వర్యంలో మహిళల తైక్వాండో శిక్షణ



శిక్షణను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఖిల్లా, ఫిబ్రవరి27: మహిళల స్వీయ రక్షణ కోసం నిర్వహిస్తున్న తైక్వాండో శిక్షణను జిల్లా జడ్జి సునీత కుంచాల ప్రారంభించారని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్ తెలిపారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం ఆయన పరిశీలించారు. నగరంలోని గిరిరాజ్ కళాశాలలో మార్చి 2న 10వేల మంది మహిళలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు కోసం ఈ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ రాజవెంకటరెడ్డి, రిజర్వు ఇన్‌స్పెక్టర్ రమే ష్, తైక్వాండో కార్యదర్శి మనోజ్‌కుమార్, తదితరులు శిక్షణలో పాల్గొన్నారు.

జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు దక్షిణమధ్య రైల్వే బహుమతులు

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి27: గుండారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు దక్షిణమధ్య రైల్వేశాఖ నిర్వహించిన "వికసిత్ భారత్.. వికసిత్ రైల్వే" అనే అంశంపై పాల్గొని బహుమతులు పొందారు. భారతీయ రైల్వేశాఖ అమృ త్‌భారత్ స్టేషన్ యోజన పథకంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాస పోటీల్లో గుండారం విద్యార్థులు ప్రతిభకనబర్చారు. వ్యాసరచనలో మేఘన, తస్నీం ఫిర్దోజ్, కె.సాయిహర్షిత, చిత్రలేఖనంలో శుత్రిరెడ్డి, గంగాలక్ష్మి, ఐశ్వర్య, ఉపన్యాస పోటీల్లో బి.నిహారిక, ఆర్.లాస్య, ఎ.కృష్ణవేణి బహుమతులు పొందారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.అమర్‌నాథ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,050	రూ.59,050	రూ.740

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఆర్టికల్-370 (హిందీ) (1.00, 7.10, 10.35), సుందరం మాస్టర్ (4.25)
స్ర్కీన్-2 : సిద్ధార్థ్‌రాయ్ (1.30) బ్రహ్మయుగం (4.40, 10.40) ఊరుపేరు భైరవకోన (7.40)
స్ర్కీన్-3 : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ) (10.05, 6.35, 9.55), తప్పించుకుని తిరుగువాడు ధన్యుడు సుమతి (1.25) : ఊరుపేరు భైరవకోన (3.35)
స్ర్కీన్-4 : ముఖ్యగమనిక (1.05), మస్తీషేడ్స్ ఉన్నాయిరా (3.50), హనుమాన్ (6.50), సుందరం మాస్టర్ (10.10)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : బ్రహ్మయుగం (1.50, 7.40) ఈగల్ (4.40)
స్ర్కీన్-2 : ఆర్టికల్-370 (హిందీ) (10.40, 4.30), ఊరుపేరు భైరవకోన (1.45, 10.30), హనుమాన్ (7.30)
స్ర్కీన్-3 : హనుమాన్ (4.20), ఆర్టికల్ -370 (హిందీ) (1.05, 7.20, 10.25)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : బ్రహ్మయుగం (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : క్రాక్-జీతేగాతో జియేగా (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్